# “మనస్సు! - స్సు”

గొల్లపూడి మారుతీరావు

నిజంగా, నిండుగా నవ్వేవారిని చూస్తే నాకు భయం—ముఖ్యంగా స్త్రీని. చిరునవ్వు వెనక పెద్ద భవిష్యత్తుని దాచుకోగలగడం భగవంతుడు వారికి ప్రత్యేకంగా యిచ్చిన వరం.

ఎప్పుడయినా స్త్రీ నిన్ను సూటిగా చూసిందా వెంటనే జాగ్రత్తపడు. మర్నాడు నిన్నుచూసి నవ్వుతుంది. మూడోరోజు పలకరిస్తుంది. ఓరోజు ఎప్పుడూ చూడనితోవ వెంటవచ్చి నీభుజం మీద చెయ్యేస్తుంది—అంతే! అక్కడితో నీ అధ్యాయం సరి.

—ఏడేళ్ల క్రిందటే తనురాసిన వాక్యం ఆనాడు అర్ధరాత్రి వెన్నెలమధ్య ఒక్క జిప్పుమనేక్షణాన్న గుర్తుకొచ్చింది నీలకంఠానికి.

ఇంకా భోనవిల్లా లవతల, గదిలో నవ్వు గుండెల్ని పీలుస్తోంది—

ఎంత నిబ్బరం విక్టోరియాకి

— చల్లగాలి పుండుతేపినట్టు ఆలోచనల్ని కొరుకుతోంది. “తనదికాని వస్తువు గురించి తనెందుకు బాధపడాలి?” అన్న ఆలోచన ఈర్ష్య, జుగుప్సల మధ్య నలిగిపోతోంది—క్రిందటి క్షణం తనది కాకూడదా అన్న తపన. ఏవో సృష్టిశక్తులు తిరుగుబాటు చేసినప్పటిఫణుకు.

ఏదో పురుగు మీదపడి ఎగిరింది—తుళ్లిపడ్డాడు.

మధ్యాహ్నం తన పిరికితనం చూసి ఆమె నవ్విన నవ్వు యింకా గుండెకోస్తోంది.

అంత విశాలత్వం, అంత పెరుగుదల మనిషిలో సాధ్యమని వూహించలేని నీలకంఠం ఆమె నవ్వువత్తులో, ఆ అందం మంటల్లో భస్మీపటల మయేడు—ఆ గదిలో తనుకాకూడదా ? ' అనుకుంటె ఇప్పుడెలా ?!

ఇహ ఆలోచించ లేకపోయేడు. దూరాన వేణూ రావడం కనిపించి గుండె ఝల్లుమంది.

“ఏరా ? యిక్కడే వున్నావు ? ఈ చల్లగాలిలో—” అంటే—

అంతరాంతరాల్లో వణికాడు నీలకంఠం. ఉధృతంగా లేచివీచిన గాలికి పువ్వుతెగింది—

ఉత్సాహంగా లేచిన పువ్వుల పరిమళం తోటని పట్టుకు పచార్లు చేస్తోంది.

“ఎంతబావుందో చూడు!” అని ఆకాశం వేపు తల తిప్పాడు. విసురుగా లరిచాడు వేణు.

“నువ్వు. చూడకపోతే ఆకాశానికేం బాధలేదు కాని నీవాళు . . . . .లే”

లోపలికి వెళ్లిపోతాడేమోనని భయమేసింది.

గదిలోపలి వ్యక్తిమీద ఎంత అయిష్టత ఉన్నా, స్త్రీత్వం ఉద్వేగం మీద ఎంత నమ్మకం లేకపోయినా, ఆ చపలత ఎంత అసహ్యమయినా, విక్టోరియా మీద అంతపగ తీర్చుకోవాలనిపించ లేదు నీలకంఠానికి.

రేపు తనవేపు గ్రంథాలు మాట్లాడే కళ్లని తిప్పుతుంది—

“ఏమీ చేతకాని నువ్వు? నాకోరికమీద యీ విధంగా పగతీర్చు కొన్నావు. ఇంత ఇరుకా నీ మనస్సు” అనివ్వచ్ఛిస్తాయి కళ్లు.

ఇంక తనకు మార్గమెక్కడ ?

“అలా నడిచి రావాలి ఒక విషయం చెప్పాలి నీతో—కాదనకు”

విచిత్రంగా బెరుకు మధ్య మెత్తబడిన అతని ముఖాన్ని చూశాడు వేణు.

“ఇప్పుడెందుకు ?—ఉదయం. . . . .”

“కాదు ఇప్పుడే. నామాట వినవ్ ?”

నివ్వెరపోయినా— తమాయించుకు నడిచాడు నీలకంఠం వెనుక.

—పూర్తిగా అలంకరించుకోని అభిసారిక పాతసోయగంలా ఉంది రాత్రి వెన్నెల.

ఆకుకదిల్తే భయమేస్తోంది.వేణూ వెనక్కి తిరిగి పోతాడేమోనని.

తీసుకువచ్చాడేకాని ఏం చెప్పాలో తోచలేదు.

నది చివరం ా వెన్నెల వెండిచారలా కన్పిస్తోంది. తెలుపు వుక్కిలించినట్టు తీరాన్న ఇసిరా, ఎవరో సంచితం చేసిన పాపాల విశాల స్తూపంలాగు కన్పిస్తున్న జువ్విచెట్టూ —

భయమేస్తే—“ఇక్కడ కూచోకేం. అలా నడుద్దాం పద” అన్నాడు నీలకంఠం.

“ఏం చెప్పాలని పిలిచావ్ ?”

“లదంతా మరిచిపో”

“అదేమిటి!”

“ఈ రాత్రిని చూస్తూ అన్నీ మరిచిపోలేవూ నువ్వు ?”

“నీకు పిచ్చెక్కింది”

“పిచ్చికాదు. ఇవాళ నిన్నో ప్రళయం నుంచి తప్పించాలనుకున్నాను. మరి నన్నింకేం ప్రశ్నించకు. నే చెప్పేవరకూ తిరుగు.”

ఒక్కోరాయి నీటిలో వేస్తూ కూచున్నాడు.

“ఎలా వుంటోంది నీతో విక్టోరియా ?”

ఎంతోసేపటికి అడిగితే నివ్వెరపోయాడు వేణు.

“ఆప్రశ్న వచ్చిందేం యిప్పుడు ?”

“చెప్పు”

లేచి— నీళ్లల్లోకి కాళ్లు వేల్లాడేసి, కూచున్నాడు. “బాగానే వుంటుంది”.

ఏదో చెప్పాలనుకుని, ఏమీ చెప్పలేక పోతున్నాడు నీలకంఠం. పెద్దప్రళయాన్ని ఎదుర్కోగల స్థైర్యం వీడికి యివ్వగలనా అన్న ఆలోచన. ముఖ్యంగా స్త్రీ గురించి — అందులోనూ విక్టోరియా. అయిదేళ్లక్రితం ఆమె వ్యక్తిత్వానికి సరైన అర్థం యివ్వలేక దూరంగా తను పారిపోయొచ్చిన విక్టోరియా.

ఆనల్లటి కళ్లలో ఆకలికి భయపడి ఎక్కడో తలదాచుకున్నాడు. రెండేళ్ల తర్వాత — వేణూ దగ్గర్నుంచి శుభలేఖ వస్తే దిమ్మరపోయాడు విక్టోరియా పేరుచూసి. “వద్దు” అని వ్రాయలేకపోయేడు. నా కష్టాలకీ, చాలా అసంగతాలకీ జవాబు ఆమెలో దొరికింది. “జీవితానికిది కొత్త అధ్యాయం” అని వేణూ ఉత్తరంవ్రాస్తే చేసేది లేక శుభాకాంక్షలు పంపి, బిచికిపోయి నిద్రపోయొచ్చాడు. పెళ్లికి వెళ్లడానికి భయం. ఆకళ్లు, నవ్వూ చూడగలడా తను ? — అమ్మో!

“ఏమిట్రా ఆలోచిస్తున్నావం”టే కదిలి, “ఇక పోదాం పద” అని లేచాడు.

గాలి నరాల్ని కొరుకుతోంది. సిగరెట్టు వెలిగించి దూరంగా నడుస్తున్నాడు వేణు.

“ఏమిట్రా ఆలోచిస్తున్నావు ?” అని నీలకంఠం అడిగితే.

“నువ్వూ ఏంఆలోచిస్తున్నావోచెప్పు” అన్నాడు.

“నీగురించి. ఎప్పుడయినా పెద్ద కష మొస్తే నాకు ఉత్తరం వ్రాయి” —

“నేనేం ఆలోచిస్తున్నానో తెలుసా ? — విక్టోరియా గురించి. ఓపెద్ద పాలరాతి విగ్రహం కట్టించి, కోరికకి చిహ్నంగా ఉంచాలి” —బిగ్గరగా నవ్వేడు.

దూరాన కొండడు కన్పించేసరికి ఇద్దరూ తుళ్లిపడ్డారు.

“ఏం ?” అని వేణూ పలకరించాడు.

“వూరునుంచి ఎప్పుడొచ్చారు బాబు ?”

“ఇందాకనే, ఇంటికి వెళ్తున్నావా ?”

తలూపి వెళ్లిపోయేడు.

గాలిజోరు తగ్గి నముదాయింపుగా వుంది—

స్థిమితపడి “తొందరగా పోదాం పద” అన్నాడు నీలకంఠం.

* * *

మునిమాపువేళకి బద్ధకంగా కళ్లిప్పితే కిటికీ దగ్గర విక్టోరియా కన్పించింది—

“బాగా నిద్రపోవడం కూడా అలవాటు చేసుకున్నావే! — పెళ్లయిందంటే చాలా మారావనుకున్నాను” అంది నిబ్బరంగా.

“వాడేడీ ?” అంటే.

“ఏం ? నిన్నెత్తుకుపోతానని భయమా వూరుకి వెళ్లారు. రేపువస్తారనుకుంటాను. కాఫీ కావాలా ?”

లేచేడు. సాయంకాలం ఆకాశం వెలుగుని స్మితంగా మింగుతోంది. అజంతా విగ్రహం వయ్యారంగా వెలిగే దీపాన్ని మోస్తోంది.

"పిల్లలా ?"

విచిత్రంగా చూశాడు. "నాకా నీకా?"

"అబ్బే మాటలుకూడాను"—కిటికీ బార్లా తీసి ఆవలిస్తూ మొగం కప్పుకొంది.

"పెళ్లికి రాలేదేం ?"

"ఎందుకూ ?"

"నన్ను చూడడానికి. అపాయంలో యిరుక్కొంటున్న నా స్నేహితుణ్ణి రక్షించడానికి. అంతేనా ?"

మంచం మీదికి వచ్చి కూచొంది—చెయ్యి కదిపితే ఆమె భుజం అనేట్టుంది.

కాస్సేపటికి "వయస్సు గడిచినా నువ్వేం మారలేదు" అంది.

"బుద్ధిగా బ్రతుకుతున్నావా ?" అన్నాడు లేచి—

కోపం వచ్చింది. లేచి అతని భుజం పట్టుకు అడిగింది: "ఎవరికి బుద్ధి ? నాకా ? ఆయనకా ? నీకు బ్రతకడం కూడా తెలిసినట్టు"

ఇక మాట్లాడడానికి విసుగేసి బయటికి వచ్చేశాడు. వరండాలో నౌకరు భోజనం ఏర్పాటు చేశాడు టేబులు వేసి.

బంగళా చుట్టూ క్రీపర్లూ, క్రోటన్సూ, జీనియా పువ్వులూ' ఉన్మత్తతలో తల విరియబోసుకున్న స్త్రీలాగ భోగన్‌విల్లా—సుఖానికి పరాకాష్ఠలా వుంది.

అతను భోజనం చెయ్యనంతసేపూ పిట్టగోడని ఆనుకుని దూరంగా చెట్లమధ్య నాల్చొంది విక్టోరియా చూస్తూ.

"నిజం చెప్పు. నాగురించి నువ్వెప్పుడూ ఆలోచించలేదూ యిన్నాళ్లూ!"

ఒక్కొక్కమాటా మనస్సును ఒరుసుకొంటోంది. ఆ ప్రశ్నలకు జవాబివ్వకూడదని బాగా తెల్సు నీలకంఠానికి—పరిధుల్లేని ఆవేశాల పుట్ట విక్టోరియా. అవకాశం యిచ్చావా లోకం మరిచిపోతావ్. కాని ఆ అనుభవం పాతబడి, పేలవమయిందతనికి. అందుకని జవాబియ్యలేదు. కనీసం తలయినా ఎత్తలేదు.

అభిమానం గాయపడి, మనస్సులో ఎక్కడో ఉదాసీనత చివుక్కుమనిపించింది. విక్టోరియాకి.

"తలెత్తడానికే పిరికితనం కాబోలు పాపం. ఎంత ఒచ్చిపోయావు నువ్వు! ఇంకా నీకంటె ఆ తోటమాలి కాస్తనయం. గుంజి, బల్లెంతో పొడిచి, పలకరిస్తేనేగాని నీలో చలనంరాదు" ఆకు విరిచి లేచింది.

"మేడమీద నిద్రపోతారా ? అని అమ్మగారు అడుగుతున్నారు" అన్నాడు నౌకరు వచ్చి.

"ఇసారా చాలు" అని తోటలోకి వచ్చి కూచొన్నాడు.

కాస్సేపటికి విక్టోరియా వచ్చి "నా మీద అలిగావా ? నీపాతివ్రత్యానికి భంగం లేదులే. మేడమీదకి వెళ్లి పడుకో" అంది.

దీర్ఘస్వరంతో యిటు తలతిప్పితే నవ్వింది— "ఎందుకలా ఆకలిగా చూస్తావ్ ఎంత నిర్లక్ష్యంగా ఉండాలన్నా నీమొహం వప్పుకోదు. నువ్వెందుకూ నాకు ?—పోయి పడుకో" అని వెళ్లిపోయింది.

కడుపులోంచి కెలికినట్టయింది. విక్టోరియా పూర్తిగా బాగుపడిందన్న ఆలోచనకి ఎందుచేతో ఎక్కడా పొత్తుకుదరడం లేదు. ఇంకా ఆ అల్లరి, మాటల్లో కత్తులూ, అప్పటి నవ్వూ, కళ్ళూ అలాగే ఉన్నాయి. మరి పదేళ్లయినా ఆమత్తుతో, ఆ బిగువులో విక్టోరియా బ్రతుకలదు. కాని యిదేమిటి ?—ఇప్పుడు కన్పించేదంతా విక్టోరియా మనస్సుదే అయితే

రెండేళ్ల క్రిందట తన అనుమానాలకి తనకే సిగ్గేసింది.

అనుమానాల్తో ఒక్కోసారి మానవుడు తనని తానే హత్య చేసుకుంటాడు. ఆలోచనకి బందీ అయి భవిష్యత్తుని, వర్తమానానికి అమ్మేసుకొంటాడు.

చీకటి మధ్య చెట్లలోంచి ఏదో పిట్ట కేరుమంది.

మధ్యాహ్నం నుంచే ఏదో అసంతృప్తిగా వుంది విక్టోరియా అందం తనని మళ్లీ రెచ్చగొడుతోందేమో ?—'ఆ అందానికి అర్థంలేదు' అని తన మనస్సుని తాను సముదాయించుకో జూశాడు. కాని అందంకాదు—యింకా ఏదో ?—తనకే అందని ఆలోచన—. . .అదీ. . .

తోట మధ్య సిమెంటు బెంచి మరీ చల్లగా ఉంది.

కూర్చొన్న కొద్దీ క్షణాంకి ఆలోచనకు జవాబు దొరికింది.

ఇదీ విషయం. . .!

ఒక్కసారిగా విక్టోరియా మంచితనాన్ని మనస్సు అంగీకరించడం లేదు.

"విక్టోరియాలో పాత బలహీనతలున్నాయి. ఎన్నోపాపాల సమిష్టి రూపం ఆమె" అని నిర్ధారణ అయితే తన మనస్సుకి తృప్తి. విచిత్రమైంది మనస్సు. ఒకొక్కప్పుడు 'చెడు'లోంచి శాంతిని వెదుక్కొంటుంది.

బంగళా అంతా నిశ్శబ్దంగా వుంది. ఇంకా విక్టోరియా గదిలో దీపం వెలుగుతూనే వుంది. ఏదో పురుగు చప్పుడు చేస్తూ చుట్టూ తిరుగుతోంది. విసుగేసి లేచాడు. మేడమీదికి నడవబోతే, ఆమె గదిలోంచి నవ్వు వినిపించింది!

నరాలన్నీ జివ్వుమన్నాయి. గుండె ఒక 'బీట్' వదిలింది. కాలచక్రం నిలిచింది.

కిటికీలోంచి విక్టోరియా ముఖం తెలుస్తోంది. కాని ఆ పక్కన. . .పక్కన. . .ఎవరో గుర్తుతెలీడం లేదు—నల్లగా, బొద్దుగా, అనహ్యంగా—

కామానికీ, అభిరుచికీ పొందిక లేదు—అభిరుచికి భిన్నమైన పనులు చాలా కామం చేతిలో ఉన్నాయి అండ్ వైస్ వెర్స.

రక్తం వేగంగా మెదడుకు పాకుతోంది. అంత విచిత్రాన్ని మనసు ఆకట్టలేక పోతోంది.

"ఇంత పనిసాధ్యమా ?" అన్న దిగ్భ్రమతో త్వరత్వరగా క్రిందకిదిగి వచ్చేశాడు.

ఇన్ని ఆశ్చర్యాల వెనక ఒక్క ఆటవిడుపు కన్పించింది. ఆమె పాత విక్టోరియా!—తన ఆలోచనలో పొరపాటులేదు—ఎంత హాయి మనస్సుకి ?—

అంతలో వేణూ గుర్తుకొస్తే గుండె కలుక్కుమంది. ఈవేళలో వాడు ఎలా ?—

ఆలోచిస్తూ కూచొన్నాడు—

—నదినుంచి వేణూతో తిరిగి వస్తూంటే కొండడు కన్పించేసరికి నీలకంఠానికి ధైర్యం కమ్మాయి. తన కళ్లు తనకి మోసం చెయ్య




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేది లగాయితు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థ యాత్రలు. వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా వారివారిగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము. వి. పి. గా పంపగలము. వి. పి.చార్జీలు ప్రత్యేకం. దుష్గ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మా అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**

పోయి, యింకా జ్ఞాపకశక్తి నశించకపోతే— ఇతనే— యితన్నే తనాగదిలో చూసింది. . .

అబ్బ! విక్టోరియా!. . . . .

• • •

పాము కుబుసంలాంటి తెల్లటి చీరెకట్టుకుని కాఫీలు తెచ్చింది పొద్దుటే. వేణూ అప్పుడే మొహం కడుక్కొని సిగరెట్టు వెలిగించాడు.

కాఫీయిస్తూ భర్తతో "ఈయనంత పిరికి వాణ్ణి నేనెక్కడా చూడలేదండి. మీరు యింట్లో లేరనేసరికి తోటదాటి లోపలికివస్తే ఒట్టు. రాత్రంతా ఆ తోటలోనే, చలిలో. . . మీరు రాత్రెప్పుడొచ్చారు ?" అంది.

వేణూ ఒకటే నవ్వు—

"వాడంతేలే! ఆడదానిమీద వాడికి నమ్మకం తక్కువ. అందులోనూ నీ నవ్వుని చూసి భయపడ్డాడంటే తప్పులేదు.

"ఏమండీ ? అంతేనా" అని పలకరిస్తోంది. తనులేచి పిట్టగోడ దగ్గరికి వచ్చేశాడు ముఖంలో ఉద్వేగాన్ని దాచుకోలేక.

అంత గుండెలు తీసినట్టు మాట్లాడు తుందేం ? ఈ పరిహాసానికి అర్థం లేదు. వాళ్లిద్దరి నవ్వూ మరీ భయపెట్టోంది.

వెనక్కి తిరిగితే విక్టోరియా ఒక్కతే కన్పించింది. వేణూ లోపలికి వెళ్లాడు.

తెల్లగా పల్చటి చీరె, తెల్లటి బ్లౌజూ—మల్లెపువ్వులా, స్వచ్ఛతకి చిహ్నంలా వుంది.

"ఎందుకండీ అంత భయపడతారు నన్ను చూసి ?" అంది గౌరవాన్ని పెంచుతూ.

"నీ పనులు మరీ బాగుండలేదు విక్టోరియా! వాడుచూస్తే ?"

"ఏమిటి ?" అంది విస్తుపోతూ.

"రాత్రంతా ఏమిటి ?—ఆ నౌకరుతో ఛీ!. . ."

ఒకాయన నవ్వేసింది. సిగ్గుతో కుంచుకపోయి, కన్నీళ్లు తిప్పుకు ఏడుస్తుందనుకున్నాడు కాని నవ్వేసరికి నిర్విణ్ణుడయాడు.

కాటువెయ్యాల్సిన పాము మెలికలు తిరిగి, చుట్టుకుపడుకుంటే ఎలావుంటుంది ?

వేణూ వస్తే—

"ఏమండోయ్ చూశారా ? యీాయ వేమంటున్నారో ?"

చెప్తుందేమోనని వణికిపోయేడు.

"చెప్పనా ?" అంటోంది.

". . . . ."

"నామీద యీాయనకి బొత్తిగా నమ్మకం లేదు. నయం. చేతనయితే నన్ను జైలుకి పంపే వాళ్లే. పోనీలెండి—వేన్నీళ్లు స్నానం చేస్తారా ?" అంటూ లోపలికి వెళ్లింది.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావ్? విక్టోరియా గురించేనా ?" అన్నాడు వేణూ దగ్గరికి వచ్చి.

"ఎందుకు పెళ్లిచేసుకున్నావ్ విక్టోరియాని?"

"అదేమిటి!"

"చెప్పుము"

నవ్వేడు వేణు. భుజంమీద చెయ్యేసి "రంగు రంగుల బంగళా, క్రోటన్సూ, ఫోర్స్‌విల్లా, కాఫీ, టొచ్చుకుక్కా, మంచిసినీమా ఎలాకావాలో అలాగే ఓమంచి భార్య కావాలనిపించింది. ఇక వయ్యో శతాబ్దపు బ్రతుక్కి భార్య ముగింపు. అందుకని తెచ్చుకున్నాను విక్టోరియాని. ఓ పిచ్చుకలాగు, శీతాకోక చిలుకలాగు పెంచు కొంటున్నాను. అలా మాట్లాడుతూ, తుళ్లుతూ ఉంటే నీకు సంతోషంగా ఉండదూ ? అదిగో వస్తోంది. వూరుకో" అన్నాడు.

ఎందుకో నీలకంఠం మనస్సు గాయపడింది. అతను వూహించిన దానికి వ్యతిరేకంగా ప్రపంచం పరిగెత్తిపోయింది. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న మల్లె పందిరిమీద తుపానుగాలి సోకినట్టు పొందికగా ఉన్నమనస్సు కదిలింది. వేణూ పొందే ఆటవిడుపుకి పూర్తిగా అర్థం చేసుకోలేక పోయాడు. మనస్సులో ఏదోదాచుకుని హుందాకి పైకి అలాచేస్తున్నాడేమో మనస్సులో ఎన్ని ప్రళయాలున్నాయో ? అలా అనుకొని తృప్తి పడుతోంది మనస్సు. నిజంగా ఉన్నాయని తెలిస్తే ఎంతహాయి మనస్సుకి.

మనస్సు—ఉఫ్!—

రైలుదగ్గర ఆ విషయం మళ్లీ ఎత్తాడు నీలకంఠం.

నవ్వేసి వూరుకొన్నాడు వేణు.

ఏదో చెప్పాలనుకుని ఉబలాట పడుతోంది మనస్సు. ఇక దాచుకోలేక కక్కేశాడు—

"నీకు తెల్సనోలేదో—విక్టోరియా, లకొండ డితో"

ఓ క్షణం మతిపోయినట్టు చూశాడు వేణూ. అంతలో విరగబడి నవ్వేశాడు.

"నీకూ తెల్సిందా! అదంతా పాతఃథలే!" నవ్వుతున్నాడు

"నీ కిదివరకే తెల్సా!"

"ఊఁ"

నీలకంఠం ఆశ్చర్యానికి అంతులేదు—గార్డు విజిల్ వేస్తున్నాడు.

"ఎలా బ్రతుకుతున్నావురా అటువంటి మనిషితో ?"

"నీకు తెలీదు. విక్టోరియా అన్న మనిషి కావాలి నాకు" నవ్వేడు. ఇంకా నీలకంఠం దిమ్మెర పోవడం చూసి "అర్థంకాదులే యిది—నాలాగ బ్రతకడానికి నువ్వు పదేళ్లు ప్రయత్నించాలి బహుశా జీవితమంతానేమో. నా కేం బాధ ల్లేవులే. ఉత్తరం వ్రాస్తుండు'

రైలు కదలింది—

వేణూ చెయ్యి దూరంనుంచి తెలుస్తోంది.

ఏదో చెయ్యడానికి వచ్చి, మనసుని గాయపరుచుకు పోతున్నాడు నీలకంఠం. ఆబడ బానలంలోంచి అమృతం తెచ్చుకోవడం సాధ్యమా. అన్నది తెగని ప్రశ్న. ఇన్నీ తెలిసి వేణూ హాయిగా ఉంటున్నాడంటే ఏదో అపూర్వశక్తి అతణ్ణి నిత్యం జోకొట్టుతుండాలి-

విక్టోరియా, వేణూ, ఆ ఒంటడు—అల్లప్పుడు చూసి దూరంనుంచి నవ్వుతున్నారు.

మళ్లీ ఎక్కడో మనస్సులో ఆలజడి రేగింది. స్నేహితుడు సుఖంగా ఉంటున్నాడన్న తృప్తి కంటె, అయిదేళ్ల క్రితం తను వదల కూడని వస్తువుని వదులుకున్నాడేమో నన్న సంశయం మళ్లా పీకుతోంది.

విక్టోరియా!. . . .

"భగవాన్!—అన్నీ యిచ్చావు నాకు—సుఖాన్నీ, తృప్తినీ, శాంతినీ, చివరికి స్త్రీనీ—అన్నిటినీను. కాని యీ మనస్సు ఎందుకు మిగిల్చావు ?" అంటే దేవుడు అన్నాడు:

"మనస్సు!—ప్ఫ్!"


బాలాసరస్వ కమ్మైనది




"సులేఖ"

మరియు

బ్రీఫ్‌మన్

ఫౌంటెన్‌పెన్‌లు

హెడ్డాఫీసు : పెన్‌మెన్ ఇండస్ట్రియల్, నప్తి సెస్, బొంబాయి—67.

బ్రాంచి: పెన్‌మెన్ ఇండస్ట్రియల్ సర్వీసెస్ ఇహాంపంజాపీథి, బస్టాండుహార్బోటుపద్ద విజయవాడ.

గుంటూరు: ఆగస్టు 18 నుండి 22 వరకు ఉడిపిశ్రీకృష్ణభవన్, స్టేషన్‌రోడ్. విజయవాడ : ఆగస్టు 23 నుండి 27 వరకు వెల్కం హోటల్, గాంధీనగర్.

ఉబ్బసము, గుండెజబ్బు కడుపునొప్పి, మధు మేహముల ఆస్పత్రి

డా. శ్రీ మూ రా ప్రసు

ఇతర వైద్యములతో నయము కాని పై వ్యాధుల, బ్లడ్‌ప్రెషరు, కడుపులో పుండు, సర్వమేహముల, యీారు ఎంత ఎక్కువ బాధపడుతున్నను పూర్తిగా, ఏమీ లేకుండా 4 వారములలో తప్పకనయమౌ సర్వసిద్ధౌషధచికిత్సాసంప్రదింపుండి.

హెడాఫీసు : హైద్రాబాదు

ఇస్త్రీగంజివెనుక, కోఠి.